ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 8 డిసెంబరు 2025

## నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మి రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అర్చకులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, అభిషేకాలను చేసి అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. భక్తులకు ఆలయ సిబ్బంది వసతులను కల్పించారు. కార్యక్రమంలో చైర్మన్ రాజన్ననాయుడు, ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గండికోటలో సండే... సందడి

● కిక్కిరిసిన పర్యాటకులు


జుమ్మా మసీదు ప్రాంగణంలో పర్యాటకుల సందడి

జమ్మలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఆదివారం సందడి నెలకొంది. శనివారం సాయంత్రం చేరుకున్న వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. కోట ప్రాంగణంలో, లోయ ప్రాంతం వద్ద పర్యాటకులు సెల్ఫీలు తీసుకున్నారు. బెంగళూరు, చెన్నై, అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. శని, ఆదివారాల్లో వ్యాపారస్థులకు, లాడ్జీలకు మంచి గిరాకీ ఏర్పడింది. కాగా శనివారం సాయంత్రం హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి గండికోటకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల వరకు గండికోటలో వివిధ కట్టడాలు సందర్శించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు అర్బన్ పోలీసులు, సీఐ నరేష్ బాబు, ఎస్ఐ రామకృష్ణ, వారి సిబ్బందితో పాటు మరికొందరు న్యాయవాదులు పాల్గొన్నారు.

## కుంగిన బ్రిడ్జి

● పట్టించుకోని అధికారులు


7

# అరకొర వసతులే...!

- అద్దె భవనాల్లోనే పదికి పైగా ప్రభుత్వ కార్యాలయాలు
- కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంలో పూర్తి స్థాయి వసతులు
- ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఎప్పుడో?
- మూడున్నరేళ్లయినా ఇదీ రాయచోటి పరిస్థితి...

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి ఏర్పడి సుమారు మూడున్నరేళ్లు దాటుతున్నా ఇంకా సుమారు పదికి పైగా ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే ఉంటున్నాయి. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంలో మాత్రమే పూర్తి స్థాయి వసతులు ఉన్నాయి. మిగిలిన అన్ని కార్యాలయాల్లోనూ.. ఉండాల్సినంత స్థాయిలో వసతులు లేవు. దీంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు కొన్ని రాయచోటి పట్టణంలో ఎక్కడో ఓ మూల విసిరేసినట్లు ఉన్నాయి. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. అదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పేరుతో సుమారు 70 నుంచి 80 ఎకరాలలో రూ.100 కోట్ల వ్యయంతో నిర్మిస్తామని ఎన్నికల ముందు హడావుడి చేసింది. అయితే ఆ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు కనీసం శిలాఫలకం కూడా వేయకుండానే వైసీపీ పాలన ముగిసిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 16 నెలలు అవుతోంది.. కూటమి ప్రభుత్వమైనా తగినన్ని నిధులు కేటాయించి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

### పదికి పైగా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే...

పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవు. సుమారు పదికి పైగా కార్యాలయాలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ, మైనింగ్ శాఖ, సివిల్ సప్లయ్స్, తూనికలు కొలతలు, ఆర్డీవో, జిల్లా రిజిస్ట్రార్, స్త్రీ శక్తి భవనం, లేబర్ ఆఫీసర్, దేవదాయశాఖ కార్యాలయాలు ఇప్పటికీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. జిల్లా డ్వామా కార్యాలయం దిగువఅబ్బవరం సచివాలయంలో, డీపీవో కార్యాలయం చెన్నముక్కపల్లె సచివాలయంలో, ఒకప్పటి కొత్తపేట ఎంపీయూపీ స్కూల్‌లో డీఈవో కార్యాలయం, సర్వశిక్షా అభియాన్ పీవో కార్యాలయం నడుస్తున్నాయి. ఇందులో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం కొత్తపేట రామాపురంలో అద్దె భవనంలో ఉంది. ప్రజలు ఇక్కడికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఐసీడీఎస్ పీడీ కార్యాలయం సైతం గున్నికుంట్ల రోడ్డు మార్గంలో ఎక్కడో ఒక సందులో అద్దెభవనంలో నడుస్తోంది. రెవెన్యూలో ముఖ్యమైన ఆర్డీవో కార్యాలయం సుండుపల్లె రోడ్డులో ఆర్టీసీ డిపో వద్ద అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడికి వెళ్లడానికి సామాన్య జనం ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు నుంచి అక్కడికి వెళ్లడానికి రూ.100కు తక్కువ కాకుండా ఆటోలకు ఖర్చు అవుతోంది. ఇలా పట్టణంలో ఎక్కడో దూరంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల అడ్రసులు తెలుసుకుని వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు.

### పూర్తి స్థాయి వసతులేవీ?

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో 90కి పైగా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో నిత్యం ప్రజలు వచ్చే కార్యాలయాలు ఉండగా.. ప్రజలు ఎప్పుడో కానీ ముఖం చూడనివి కూడా ఉన్నాయి. కడప-బెంగళూరు జాతీయ రహదారి కడప రింగు రోడ్డు సమీపంలో గిరిజన బాలుర వసతి గృహంలో కలెక్టరేట్‌ను ఏర్పాటు చేశారు. అదే రహదారికి సమీపంలోనే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ మూడున్నరేళ్లలో పై రెండు కార్యాలయాల్లోనూ పూర్తి స్థాయి వసతులు ఏర్పడ్డాయనే చెప్పవచ్చు. జిల్లా డ్వామా కార్యాలయంలో ఒకే గదిలో ఆరేడు మందికిపైగా సిబ్బంది కూర్చుని విధులు నిర్వహించాల్సి వస్తోంది.. దాదాపు ఇదే పరిస్థితి జిల్లా కేంద్రంలోని అన్ని జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఉన్నాయి. చాలా వరకు అధికారులు, సిబ్బంది సర్దుకుపోతున్నారు. కొత్తగా జిల్లా కేంద్రం ఏర్పడినపుడు గిరిజన బాలుర వసతి గృహంలో, పక్కనే ఉన్న కొన్ని భవనాల్లో కలెక్టరేట్‌తో సహా పలు శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా రాజంపేట మార్గంలోని పట్టణ శివారులో ఓదివీడు సమీపంలో ఉన్న మైనార్టీ పాలిటెక్నిక్ భవనాల్లోనూ పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, సహకార బ్యాంకుల కార్యాలయాలు, వ్యవసాయం, ఉద్యానం, మత్స్యశాఖ, సూక్ష్మ సేద్యం, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఏపీ ఫైబర్‌నెట్, భూగర్భజలశాఖ, స్పోర్ట్స్, మార్కెటింగ్ సమాఖ్య జిల్లా మేనేజర్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాల్లో సరైన మౌలిక వసతులు కూడా లేవు. ఇక్కడ సిబ్బంది తాగునీటి కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇక మహిళా ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. చుట్టూ ఉన్న పల్లెలకు వెళ్లే విద్యుత్ లైను నుంచే వీటికి కనెక్షన్ తీసుకోవడంతో ఈ కార్యాలయాలకు ఒక్కోసారి మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా కరెంట్ ఉండదు. ఈ కార్యాలయాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో తరచూ విషసర్పాలు దర్శనమిస్తూ ఉంటాయి. ఊరికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ కార్యాలయాలు ఉన్నాయి. కలెక్టరేట్ సమీపంలో ఉన్న కార్యాలయాల్లో సౌకర్యాలు కొంత మెరుగ్గా ఉన్నాయనే చెప్పవచ్చు. జిల్లా ఏర్పడిన తొలినాళ్లలో పలు కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కూడా లేక ఇబ్బందులు పడ్డారు. అధికారులే ఎలాగోలా వీటిని సమకూర్చుకున్నారు.


అద్దె భవనంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

### ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణమెప్పుడో?

వైసీపీ ప్రభుత్వ హయాంలో కడప-గాలివీడు రింగు రోడ్డుకు సమీపంలో సర్వే నెంబరు-971లో సుమారు 70 నుంచి 80 ఎకరాలను ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కోసం కేటాయించారు. ప్రజల సౌకర్యం కోసం అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఒకచోటే ఏర్పాటు చేస్తామని, ఈ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను రూ.100 కోట్లతో నిర్మిస్తామని ఎన్నికలకు ముందు వైసీపీ హడావుడి చేసింది. అయితే దీనికి సంబంధించి కనీసం శిలాఫలకం కూడా వేయకుండానే వైసీపీ పాలన ముగిసిపోయింది. కొందరు వైసీపీ నాయకులు మాత్రం ఈ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు కేటాయించిన భూముల్లో కొంత తమ పేరు మీద అక్రమంగా మార్చుకుని కాజేయాలని చూశారు. ఈ విషయం బయట పడడంతో ఈ అక్రమానికి ఆదిలోనే తెరపడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు దాటుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించి... ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.





ప్రహరీ గోడ లేని డీఆర్‌డీఏ కార్యాలయం- జిల్లా డ్వామా కార్యాలయంలో చిన్న గదిలోనే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

## కల్వర్టును ఢీకొన్న కారు

● ఆరుగురు అయ్యప్పస్వాములకు గాయాలు

చంద్రగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగరాల వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం తెల్లవారుజామున కారు కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అయ్యప్ప స్వాములకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. రైల్వేకోడూరుకు చెందిన సాయికుమార్, అజయ్‌కుమార్, జస్వంత్, మణికంఠ, నితీష్, యోగేశ్ శబరిమలకు వెళ్లి తిరిగి రైల్వేకోడూరుకు వస్తుండగా ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అగరాల సమీపంలోని నారాయణ కళాశాల వద్ద రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొని కారు పల్టీ కొట్టింది. కారు నుజ్జు నుజ్జయింది. కారులో ఉన్న సాయికుమార్, అజయ్‌కుమార్, జస్వంత్, మణికంఠ, నితీష్, యోగేశ్‌లకు గాయాలయ్యాయి. సాయికుమార్‌కు తీవ్ర గాయాలయాయ్యాయి. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కూలిపోయిన కల్వర్టు గోడ



నుజ్జు నుజ్జయిన కారు

## జాలువారుతున్న జలం

● పర్యాటకులను కనువిందు చేస్తున్న జలపాతాలు


బాలపల్లె వద్ద పర్యాటకుల సందడి


రైల్వేకోడూరు మండలం బాలపల్లె వద్ద గంగమ్మ పరవళ్లు


శేషాచలం కొండల్లో నుంచి జాలువారుతున్న జలం

వెలుగొండ, శేషాచలం, పెనుశిల, పాలకొండల్లో జలం జాలువారుతోంది. ఇది పర్యాటకులను కనువిందు చేస్తోంది. రైల్వేకోడూరు మండలంలోని బాలుపల్లె అడవుల వద్ద జలపాతాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. తిరుపతికి కార్లు, బైక్‌లలో వెళ్లే వారు ఇక్కడ ఆగి నీటిలో దిగి ఫొటోలు తీసుకుంటూ మురిసిపోతున్నారు. అడవుల్లో ఎక్కడ పట్టినా జలంతో నిండి ఉండడంతో పచ్చదనం ఉట్టిపడుతోంది.

- రైల్వేకోడూరు, (ఆంధ్రజ్యోతి)

## ప్రమాదపుటంచున మెరగల చెరువు

● తెగిపోయిన చెరువు తూము కాలువ

● ప్రశ్నార్థకంగా మారిన 200 ఎకరాల ఆయకట్టు

గాలివీడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆ చెరువు నూలివీడు పంచాయతీ గ్రామ ప్రజలకు గుండెకాయలాంటిది. మండలంలోని ప్రాజెక్టుల తర్వాత ఆయకట్టు విషయంలోనూ, విస్తీర్ణం విషయంలోనూ అతి పెద్ద చెరువు. ఒకసారి నిండితే రెండు సీజన్లలో వరిని సాగు చేసుకోవచ్చు. ఆ చెరువు ద్వారా పరోక్షంగా ఎన్నో బోరు బావుల్లోకి సాధారణ బావుల్లోకి నీరు చేరి భూగర్భజలాలను పెంపొందిస్తున్నది. 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆ చెరువు రెండు వందల ఎకరాలకు పైన సాగు భూమి కలదు. 30 మీటర్ల వరకు కటవ పూర్తిగా దెబ్బతిన్నా గత వైసీపీ ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోలేదు. చెరువు మొరవ వల్ల తూము నుంచి వచ్చే కాలువ పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో చెరువు కింద ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని నూలివీడు పంచాయతీ నక్కలవాండ్లపల్లె సమీపంలో మెరగల చెరువు కటవ 2022లో కురిసిన వర్షాలకు 30 మీటర్ల వరకు పూర్తిగా కుంగిపోయి నెర్రెలు చీలింది. అప్పుడు తాత్కాలికంగా మట్టి తోలి వదిలేశారు. తర్వాత కురిసిన వర్షాలు కూడా మరొకసారి కటవ నెర్రెలు చీలినా అప్పటి ప్రభుత్వం ఆ చెరువు గురించి పట్టించుకోలేదు. అదే సమయంలో ఆ చెరువు నుంచి తూముగుండా వెళ్లే ప్రధాన కాలువ కొట్టుకుపోయి ఇప్పటికి మూడు సంవత్సరాలు అయింది. అయినా ఇంతవరకు ఇరిగేషన్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఆయకట్టు రైతులు, గ్రామ ప్రజలు ఎన్నోసార్లు ఇరిగేషన్ అధికారులకు అర్జీల రూపంలో తెలియజేసినప్పటికీ ఇంతవరకు వాటికి మరమ్మతులు చేయలేదు. ప్రస్తుతం మూడు సంవత్సరాల తర్వాత పూర్తి స్థాయిలో చెరువులు నిండాయి అందులో మెరగల చెరువు కూడా పూర్తిగా నిండింది. ఇంకా వర్షాలు ఎక్కువగా కురిస్తే కటవ తెగితే నూలివీడు కస్బాతో పాటు నాగూరివాండ్లపల్లె కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వీటితో పాటు దిగువ ఉన్న దాదాపుగా చెరువులన్నీ తెగిపోయే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కటవ మరమ్మతులతో పాటు తూము తెగిపోయిన కాలువ మరమ్మతులు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


తెగిపోయిన మెరగలచెరువు తూము కాలువ


రెండుగా చీలుతున్న చెరువు కటవ


పూర్తిగా నిండిన మెరగల చెరువు

### బీడు భూములుగా మారే ప్రమాదం



మా కుటుంబానికి మెరగల చెరువు కింద 5 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. మెరగల చెరువు తూము కాలువ పూర్తిగా తెగిపోయింది. కాలువ తెగిపోవడంతో కాలువ కింద ఉన్న ఆయకట్టు భూమి పూర్తిగా బీడు భూమిగా మారనున్నది. ఇరిగేషన్ అధికారులకు చాలాసార్లు కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని చెప్పినా వారు ఎవరూ పట్టించుకోలేదు.

- ధర్మారెడ్డి, నక్కలవాండ్లపల్లె

## నిజాయితీకి నిలువుటద్దం క్రిష్ణారెడ్డి

● హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి



క్రిష్ణారెడ్డి చిత్రపటాన్ని ఆవిష్కరించిన హైకోర్టు జడ్జి శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కోర్టులో నీతి, నిజాయితీకి నిలువుటద్దంగా సీనియర్ న్యాయవాది స్వర్గీయ క్రిష్ణారెడ్డి పనిచేశారని హైకోర్టు జడ్జి కె.శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఆదివారం ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 64 ఏళ్ల న్యాయవాదిగా క్రిష్ణారెడ్డి అందించిన న్యాయ సేవలకు గుర్తుగా ఆయన చిత్రపటాన్ని హైకోర్టు జడ్జి కె.శ్రీనివాసులరెడ్డి ఆవిష్కరించారు. క్రిష్ణారెడ్డితో పాటు న్యాయవాది గంగిరెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి మాట్లాడుతూ న్యాయస్థానాల్లో సామాన్యునికి కూడా న్యాయం జరగాలంటే నిజాయితీపరులైన న్యాయవాదులు అవసరమన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎందరో న్యాయవాదులకు క్రిష్ణారెడ్డి జీవితం ఆదర్శనీయమన్నారు. క్రిష్ణారెడ్డి మనవడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆయన నేర్పిన క్రమశిక్షణతోనే మంచి స్థాయికి ఎదిగామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రామచంద్రారెడ్డి, సీనియర్ న్యాయవాదులు దాదా హయాత్, ఈవీ సుధాకర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కొండారెడ్డి, రఘునాథరెడ్డిలతో పాటు పెద్దఎత్తున న్యాయవాదులు పాల్గొన్నారు.

## కోడిపందాలపై పోలీసు దాడి

● వాహనాలు సహా నగదు స్వాధీనం

నిమ్మనపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లి పంచాయతీలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న కోడిపందాలపై పోలీసులు ఆదివారం మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విష్ణునారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబడిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● విస్తృతంగా గాలింపు చర్యలు



మృతి చెందిన నారాయణ

సిద్దవటం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పొలాలకు కాపలాదారుగా పనిచేస్తున్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి భార్య రత్నమ్మ కథనం మేరకు... మండలంలోని జవుకులపల్లికి చెందిన నారాయణ (45) కడప-చెన్నై జాతీయ రహదారి చర్చి పక్కన ఉన్న పొలంలో కాపలాదారుగా పనిచేస్తూ కుటుంబంతో కలసి అక్కడే నివాసముంటున్నాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవపడంతో పాటు దాడికి యత్నించడంతో ఆమె బాకరాపేటకు పారిపోయింది. ఆదివారం ఆమె తిరిగి వచ్చేసరికి భర్త మృతి చెంది కనిపించాడు. దీంతో ఆమె బంధువులకు సమాచారమిచ్చింది. సమాచారం అందుకున్న ఒంటిమిట్ట సీఐ నరసింహరాజు సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతదేహం నుదిటిపై రక్త గాయం ఉండడంతో కడప నుంచి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీ చేశారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ, క్లూస్‌టీమ్ ఇన్‌స్పెక్టర్ రుక్మిణిదేవి, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి ఆత్మహత్య



మృతి చెందిన వెంకటలక్ష్మమ్మ (ఫైల్‌ఫొటో)

సిద్దవటం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్న కుటుంబానికి భారం కాకూడదని ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మేనల్లుడు కుప్పాల వెంకటసుబ్బయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ పాలకొండ్రాయుని పల్లెకు చెందిన పెద్ద వెంకటలక్ష్మమ్మ (63) భర్త చనిపోవడంతో తన అన్న కుటుంబంతో కలసి నివాసముంటోంది. కొద్ది రోజులుగా ఆమె పక్షవాతంతో బాధపడుతుండడంతో అన్న కుటుంబసభ్యులు అప్పులు చేసి ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. దీంతో వారి కుటుంబానికి భారం కాకూడదన్న ఉద్దేశంతో శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి ఆమె వాంతులు చేసుకుంటూ కనిపించింది. అది గమనించిన కుటుంబ సభ్యులు ఏమైందని ప్రశ్నించగా పురుగులమందు తాగానని చెప్పడంతో వెంటనే 108వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో ఏఎస్‌ఐ బాబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గండికోటలో అభివృద్ధి పనులు ప్రారంభం



గండికోటలో జరుగుతున్న రోడ్డు పనులు

జమ్మలమడుగు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్యాటక ప్రాంతమైన గండికోటలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గండికోటను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించి ఈ ప్రాంతం అభివృద్ధికి సంబంధించి టాస్కీ నిధులు దాదాపు రూ.79 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి వెళ్లారు. తర్వాత సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగా గొడవ చోటుచేసుకుని ఇటీవల సద్దుమణిగింది. ఈ క్రమంలో వేరే కాంట్రాక్టర్ గండికోటలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆదివారం కోట ఎదురుగా లోయ ప్రాంతానికి వెళ్లే దారి, అక్కడి నుంచి గుర్రపుశాల వరకు రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. గతంలో ఎనిమిది అడుగుల రోడ్డు ఉండేదని, మళ్లీ ఎనిమిది అడుగులకు పైగా కొలతలు వేశారు. ఈ మేరకు మట్టి చదును పనులు జరుగుతున్నాయి.

# కుంగిన బ్రిడ్జి



● పట్టించుకోని అధికారులు

● భయాందోళనలో తల్లిదండ్రులు, విద్యార్థులు

ఒంటిమిట్ట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న బ్రిడ్జి కుంగిపోయింది. దీంతో ఆ బ్రిడ్జిపై వెళ్లాలంటే అక్కడి ప్రజలు భయపడుతున్నారు. కడప-చెన్నై ప్రధాన రహదారి నుంచి ఈ గ్రామానికి వెళ్లేందుకు తారురోడ్డు నిర్మించారు. మార్గమధ్యంలో ఒక బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి ఇరువైపులా కుంగిపోవడంతో ఈ గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చెర్లోపల్లె నుంచి ఒంటిమిట్ట, కొత్తమాధవరం, మంటపంపల్లె గ్రామాల్లో ఉన్న పాఠశాలలకు ఇక్కడి విద్యార్థులు వెళుతున్నారు. ఈ క్రమంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు స్కూలుకు వెళ్లి ఇంటికి వచ్చిన పిల్లలను చూస్తేగాని వారి భయం పోవడంలేదు. ఇలా ఎన్నిరోజులు భయపడుతూ తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని ప్రశ్నిస్తున్నారు. ఈ గ్రామాలకు వెళ్లాలంటే బ్రిడ్జిపై వెళ్లాల్సిందే. మరో మార్గం లేదు. ప్రతిరోజు ఈ గ్రామ ప్రజలు వారి అవసరాల నిమిత్తం ఒంటిమిట్ట, కడప, రాజంపేటకు వెళుతూ ఉంటారు. ట్రాక్టర్లు, కార్లు, పలు స్కూటర్లు ఈ బ్రిడ్జిపైనే వెళుతుంటాయి. బ్రిడ్జి కుంగిపోయి 10 రోజులు కావస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ నాగరాజు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం ఈఈతో కలిసి బ్రిడ్జిని పరిశీలించామన్నారు. బ్రిడ్జి వద్ద నిదానంగా వెళ్లాలనే బోర్డును ఏర్పాటు చేయాలని సర్పంచ్‌కు తెలిపామని, త్వరలో మరమ్మతులు చేస్తామన్నారు.

### పిల్లలతో భయపడుతున్నాం..



ప్రతిరోజు పిల్లలు పాఠశాలకు వెళుతున్నారు. ఈ బ్రిడ్జిపై పాఠశాలకు వెళ్లాల్సి రావడంతో భయపడుతున్నాం. వారు ఇంటికి వచ్చేవరకు భయంభయంగానే కాలం గడుపుతున్నాం. అధికారులు త్వరగా స్పందించాలి.

\- ప్రతాప్‌రెడ్డి, చెర్లోపల్లె, ఒంటిమిట్ట

### త్వరగా మరమ్మతులు చేయాలి..



మా గ్రామానికి వెళ్లే బ్రిడ్జి కుంగిపోయింది. దీంతో భయంభయంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజులు గడిచే కొద్ది బ్రిడ్జి పూర్తిగా కూలిపోయే అవకాశం ఉంది. అధికారులు త్వరగా మరమ్మతులు చేయాలి.

\- రాజారెడ్డి, చెర్లోపల్లె, ఒంటిమిట్ట



కుంగిపోయి నెర్రెలు చీలిన బ్రిడ్జి

# వివాహిత అనుమానాస్పద మృతి

● తలకు బలమైన గాయాలు

● భర్తే చంపి ఉండవచ్చన్న అనుమానాలు

● దర్యాప్తు చేస్తున్న పోలీసులు




మృతి చెందిన సుజాత

ప్రొద్దుటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరం వెంకటేశ్వర స్వామి గుడి వద్ద గౌరు సుజాత (42) అనే వివాహిత ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆదివారం త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల మేరకు... చాపాడు మండలం రాజువారి పేటకు చెందిన గౌరు సుజాతకు 2010లో ప్రొద్దుటూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన రవికుమార్‌రెడ్డితో వివాహమైంది. రవికుమార్‌రెడ్డికి శంకరాపురంలో వ్యవసాయ పొలం వుంది. వివాహం అయ్యాక మైదుకూరు రోడ్డులోని టీచర్స్‌కాలనీలో వుండేవారు. వ్యవసాయంతో పాటు ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఇటీవలే మూడు నెలల క్రితం బొల్లవరం వెంకటేశ్వర స్వామి గుడి వద్ద ఓ ఇంటిలో చేరారు. ఇటీవల రవికుమార్ ఆరోగ్యం సరిగాలేక పని చేయలేక ఇంట్లోనే ఖాళీగా వుంటున్నాడు. మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు రవికుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులోనే వుంటున్న సుజాత సోదరికి ఫోన్ చేసి సుజాత మరణించిందనే సమాచారమిచ్చాడు. దీంతో సుజాత బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో మంచం వద్ద రక్తపుమడుగులో సుజాత నిర్జీవంగా పడివుంది. క్లూస్ టీం పరిశీలించింది. తలకు బలమైన గాయంతో ఆమె మరణించి వుంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి భర్త రవికుమార్‌పై కూడా బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది హత్య లేదా ప్రమాదమా అనేదానిపై పోలీసులు విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

## తృటిలో తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం

● ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్




బోల్తా పడిన జిప్సం టిప్పర్

ముద్దనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును జిప్సం లోడు తీసుకొని వస్తున్న టిప్పర్ ఢీకొని బోల్తా పడింది. ఆదివారం రాత్రి ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం లేదు. స్థానికుల సమాచారం మేరకు... నంద్యాల నుంచి ముద్దనూరులోని మనగ్రోమోర్‌కు జిప్సం లోడు తీసుకువస్తున్న టిప్పర్ జమ్మలమడుగు ఘాట్ రోడ్డులో బ్రేక్ ఎయిర్ ట్యాంక్ పగిలిపోవడంతో టిప్పర్ అదుపు తప్పింది. దీంతో అతివేగంగా టిప్పర్ ఘాట్ రోడ్డులో వస్తోంది. ముద్దనూరు టౌన్ నుంచి జమ్మలమడుగుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు శివాలయం వద్దనున్న కాయన వంక మీదుగా వస్తుండగా టిప్పర్ డ్రైవర్ మనోహర్ కేకలు వేసుకుంటూ వచ్చాడు. అరుపులు విన్న వాహనచోదకులు శివాలయం ముందు నిలిచి ఉన్న పెళ్లి బృందం ఐచర్ వాహనం ముందుకు వెళ్లిపోయింది. ఎదురుగా వెళుతున్న ఆర్టీసీ బస్సును రోడ్‌సైడు నిలిపివేశాడు. ఈ క్రమంలో బస్సును తప్పించబోయి టిప్పర్ డ్రైవర్ బస్సును కుడివైపు రాచుకుంటూ వెళ్లడంతో టిప్పర్ బోల్తా పడింది. ఆర్టీసీ బస్సు అద్దం పగిపోయింది. అప్పటికి బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. టిప్పర్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. పెళ్లి బృందం ఐచర్ వాహనం, బస్సును ఢీకొన్నా ప్రాణనష్టం జరిగి ఉండేది. కేవలం నేషనల్ హైవే అధికారులు బైపాస్ రోడ్డు ఏర్పాటులో భారీ తప్పిదం చేశారని, ఘాట్ రోడ్డు నుంచి నేరుగా ముద్దనూరు టౌన్‌లోకి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికి 6 లారీ ప్రమాదాలు జరిగి టౌన్‌లోని ఇళ్ల యజమానులకు భారీ నష్టం వాటిల్లింది. గతంలో నేషనల్, హైవే అధికారులకు, కలెక్టర్ దృష్టికి బాధితులు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఇటువంటి ప్రమాదాలు జరుగకుండా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆసక్తికరంగా క్రికెట్ మ్యాచ్‌లు



లిఖిత్ ఇరగంరెడ్డి (96పరుగులు)



ఐదు వికెట్లు సాధించిన చాణక్య సాయి

కడప స్పోర్ట్స్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏపీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండురోజుల క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం ఆసక్తికరంగా సాగుతున్నాయి.

### ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 300పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. చరణ్‌తేజ్ 70పరుగులు, యాసిన్ సిద్దిక్ 53 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి ఐదు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 12పరుగులు చేసింది. దీంతో మరో 288 పరుగుల వెనకంజలో ఎదురీదుతోంది.

### కేఓఆర్ఎం మైదానంలో...

నగర శివారులో ఉన్న కేఓఆర్ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్, నార్త్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 179 పరుగులకు కుప్పకూలింది. ఏవీ చరణ్ 53 పరుగులు చేశాడు. కాగా బౌలింగ్ విభాగంలో నార్త్ జోన్ విన్నర్స్ జట్టు బౌలర్ చాణక్యసాయి 5వికెట్లు పడగొట్టారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన నార్త్ జోన్ విన్నర్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి కేవలం 30 పరుగులు మాత్రమే చేసింది. దీంతో మరో 149 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది. కాగా బౌలింగ్ విభాగంలో బౌలర్ చాణక్యసాయి 5 వికెట్లు పడగొట్టారు.

### కేఎస్ఆర్ఎం మైదానంలో...

నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో సౌత్ జోన్ విన్నర్స్, రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన సౌత్ జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికట్లు కోల్పోయి 251 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో లిఖిత్ ఇరగంరెడ్డి 96 పరుగులు, ప్రణవ్ గోవర్ధన 65 పరుగులు చేశారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో1 వికెట్ నష్టపోయి 39 పరుగులు చేసింది. దీంతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు మరో 212 పరుగుల వెనుకంజలో ఎదురీదుతుంది.

## లారీ కింద పడి వ్యక్తికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకృష్ణా సినిమా థియేటర్ సమీపంలో ప్రధానదారిపై ఆదివారం రాత్రి లారీ కింద పడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని గ్రామ పంచాయతీ కాలనీకి చెందిన పారిశుధ్య కార్మికుడు వెంకటేష్ ప్రధానదారి దాటి ఇంటికి వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా తిరుపతి నుంచి కడప వైపు వెళుతున్న లారీ కింద పడి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని కోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రక్తస్రావం ఎక్కువగా ఉండడంతో వైద్యులు తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజలు



అయ్యప్పస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో పెన్నానది ఒడ్డున వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం, శనివారం అంబలం పూజ నిర్వహించారు. ఈ క్రమంలో ఆదివారం కూడా అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రం లోని పోతులూరి వీరబ్రహ్మంద్రస్వామి నివాస గృహం వీధి, పాతూరు గ్రామంలో నివాసం ఉంటున్న సూరే వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. ఈ పూజా కార్యక్రమానికి మండలంలోని అయ్యప్పస్వాములంతా పాల్గొని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి అయ్యప్పస్వామికి కాయకర్పూరం సమర్పించారు. అనరంతరం అయ్యప్పస్వాములు, ప్రజలకు, భక్తులకు ప్రసాదాన్ని అందించారు.



అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న భక్తులు

## రాష్ట్ర స్థాయి టాంగ్-థా పోటీలకు 36 మంది ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

పరవాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరవాడ ఇండోర్ స్టేడియంలో టాంగ్-థా అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఏడు జిల్లాల నుంచి 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఆద్యంతం పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలకు 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం.నాయుడు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 17 నుంచి 22వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి టాంగ్-థా పోటీల్లో 36 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఎంవీ.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి అచ్చెమ్మ, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పరిశీలకులు శ్రీహరిరాజు, ఏవీడీ ప్రసాద్, నాయుడు, ప్రతినిధులు జి.రాజు, ఎ.నూకరాజు, ఎస్.శ్రీనివాస్, పి.లక్ష్మి పాల్గొన్నారు.

## సాయం చేయకపోతే నిరసన చేస్తాం

● రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ




మాట్లాడుతున్న ఏవీ రమణ

మైదుకూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటకు ప్రభుత్వం ప్రకటించిన రూ.50వేల సాయాన్ని వెంటనే విడుదల చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ డిమాండు చేశారు. స్థానిక కృష్ణపురం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో రమణ మాట్లాడుతూ కడప, కర్నూల్ జిల్లాలో కురిసిన అధిక వర్షానికి దెబ్బతిన్న ఉల్లి పంటకు రాష్ట్ర ప్రభుత్వం 50 వేల రూపాయలను సాయం అందిస్తాని ప్రకటించి రెండు నెలలు అవుతోందన్నారు. ఇంతవరకు నిధులను విడుదల చేయలేదని డిమాండు చేశారు. వెంటనే విడుదల చేయని పక్షంలో ఈనెల 15వ తేదిన కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చొక్కం సంజీవరాయుడు, కూశెట్టి పుల్లయ్య, బీఎల్ రామ్మోహన్, కొండయ్య, భూమిరెడ్డి కొండారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి చలి.. ఉదయం పొగ మంచు..

● ప్రజల ఇక్కట్లు

ఓబులవారిపల్లె, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల నుంచి ప్రజలు తేరుకోకమునుపే చలి, పొగమంచుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో తీవ్రమైన చలి భయపెడుతోంది. తెల్లవారితే పొగమంచుతో ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటల వరకు కూడా పొగమంచు వీడకపోవడంతో ప్యాసింజర్ రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రజలు రాత్రివేళ చలితో, పగటిపూట పొగమంచుతో పనులు ఆలస్యమవుతున్నాయని చెబుతున్నారు.



ఉదయం 7.30 గంటల సమయంలో పూర్తిగా పొగమంచు ఉన్న దృశ్యం

## వెంకటేశ్వరాలయానికి విరాళం



దేవాలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న భయ్యారెడ్డి

గాలివీడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందికుంట పంచాయతీ వెంకటాపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి రిటైర్డ్ లెక్చరర్, న్యాయవాది కానాల భయ్యారెడి రూ.10 వేలు విరాళం ఇచ్చినట్లు ఆలయ నిర్వాహకుడు విశ్వనాథరెడ్డి తెలిపారు. మండలంలోని పలు ఆలయాల్లో ధూపదీప నైవేద్యానికి, వాటి అభివృద్ధికి తన సొంత డబ్బులను అందజేశారని వివరించాడు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న రామంజులు కుటుంబసభ్యులు

రామాపురం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామం గొల్లపల్లెకు చెందిన కొమ్మనపల్లి రామాంజులు పెద్ద కుమారుడు ప్రవీణ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా రామాపురం మండలం బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మనపల్లి అన్నపూర్ణ, మహేంద్ర, దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాగారపమ్మకు పూజలు, బోనాలు



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

సుండుపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దినేనికాలువ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలోని నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు బోనాలు సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భకులు తలనీలాలను సమర్పించారు. అనంతరం ఆలయ సమీపంలోని మామిడి తోటల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## ‘30 ఏళ్లుగా పార్టీ గీత దాటలేదు’

గాలివీడు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): గత 30 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో పని చేస్తున్నాను. ఎప్పుడూ పార్టీకి వ్యతిరేకంగా పని చేయలేదని ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాపేసాహెబ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తూముకుంట గ్రామంలో టీడీపీ అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. పార్టీ సహకారంతో 2001లో సర్పంచ్‌గా 2007లో ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొంది పార్టీ గ్రామ అభివృద్ధికి కృషి చేశానని పేర్కొన్నారు. తూముకుంట కస్బాలోని మసీదుకు 30 ఏళ్లగా ముత వల్లిగా పనిచేస్తున్నానని, ఇంతవరకు తనమీద ఎలాంటి ఆరోపణలు లేవన్నారు.వైసీపీ నాయకుల ట్రాక్‌లో పడిన కొందరు నాయకులు తనపై ఆరోపణలు చేయడమే కాక, పార్టీ నుంచి తనను సస్పెండ్ చేయడం అన్యాయమని తెలిపారు. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. పాపేసాహెబ్ మసీదు నిధులు సంబంధించి ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని ఆయన టీడీపీని నమ్ముకొని పని చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన రాంమోహన్ నాయుడు తెలిపారు.

# గ్రామీణ బ్యాంకు భద్రత గాలికి..!

● ఊరి చివర బ్యాంకు కార్యాలయం ● చోరీకి దుండగుల విఫలయత్నం ● అయోమయంలో ఖాతాదారులు

రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఊరి చివర నిర్మానుష్య ప్రాంతంలో ఉండడంతో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు భద్రత లేకుండా పోయిందని ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఈ బ్యాంకు గేటు తాళాలు పగులగొట్టి చోరీకి విఫలయత్నం చేసిన సంఘటనను ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు. 1981లో అప్పటి సహకార శాఖ మంత్రి అమర్‌నాథరెడ్డి, సంబేపల్లె మధ్యలో అద్దె భవనంలో రాయలసీమ గ్రామీణ బ్యాంకు శాఖను ప్రారంభించారు. 2002లో రైతు రుణమాఫీ పథకం అమలు కావడంతో అప్పట్లో ఖాతాదారులు సమావేశమై బ్యాంకుకు సొంత భవనం నిర్మించేందుకు మాఫీ అయిన మొత్తంలో కొంత భాగాన్ని విరాళంగా ఇచ్చారు. ఇలా పోగు చేసిన సుమారు 6 లక్షల రూపాయలను ముగ్గురు రైతుల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అయితే ఇప్పటి వరకు భవనం నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో ఆ డబ్బు ఏమయిందో ఖాతాదారులకు తెలియడం లేదు. 2014లో భవన నిర్మాణం కోసం సంత రోడ్డులో స్థలాన్ని కేటాయించినా భవనం నిర్మాణానికి నోచుకోలేదు. 2021లో ప్రకాశ్‌నగర్ కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో ఊరి చివర ఉన్న ప్రైవేటు భవనంలోని బ్యాంకును తరలించారు. కొద్ది రోజుల క్రితం ఈ బ్యాంకులో చోరీకి దుండగులు ప్రయత్నించారు. గంటసేపు విఫలయత్నం చేసినట్లు సీసీ పుటేజ్ ద్వారా గుర్తించారు. ఈ విషయం స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఊరికి చివరన ఉండడంతో దొంగలు ఈ సాహసానికి పాల్పడినట్లు పోలీసులు తెలియజేశారు. జనసంచారం ఉన్న ప్రదేశంలో బ్యాంకు ఏర్పాటు చేస్తే భద్రత ఉంటుందని ఖాతాదారులు భావిస్తున్నారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి బ్యాంకు భద్రతకు చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు



ఊరి చివరలో ఉన్న బ్యాంకు

**ఖాతాదారులకు భరోసా ఇవ్వాలి**



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సంబేపల్లెశాఖ ప్రకాశ్‌నగర్‌కాలనీ పరిధిలో ఊరి చివరన ఏర్పాటు ఏయడంతోనే దొంగలకు చోరీకి అవకాశంగా మారింది. అదే సంబేపల్లె ఊరి మధ్యలో ఎక్కడైనా ఏర్పాటు చేసి ఉంటే జనసంచారం ఉండేవారు భద్రత ఉండేది. గతంలో 45 ఏళ్ల ఊరికి మధ్యలో ఉండేది ఏనాడు ఇలాంటి సంఘటన జరగలేదు. మార్చిన నాలుగు సంవత్సరాలకు చోరీ ప్రయత్నించారంటే అక్కడ భద్రత లేదు. ఖాతాదారులకు భద్రత భరోసా కల్పించాల్సిన బాధ్యత బ్యాంక్ అధికారులపై ఎంతైనా ఉంది.

- కందూరి నాగేశ్వర్‌నాయుడు, పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్

# సెలవు రోజు కూడా కొనసాగిన ఆందోళన

● సీఎంకు వినతిపత్రం

● క్రైస్తవులు, వాకర్స్ ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీ

● రెండో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

రాజంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ ఆదివారం ఆందోళనలు కొనసాగాయి. రాజంపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చదిపిరాళ్ల దిలీప్ కుమార్, తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విజయవాడలో కలిసి రాజంపేట, కోడూరు నియోజకవర్గాల ప్రజల మనోభావాలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్రానికి కావాల్సిన అన్ని మౌలిక వసతులు, పక్కా భవనాలు, కావాల్సినంత ప్రభుత్వ స్థలం రాజంపేటలో ఉందన్నారు. ప్రస్తుత సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణమే సుమారు 15 ఎకరాలు ఉందన్నారు. ప్రస్తుతం సబ్ డివిజన్‌గా, పార్లమెంట్ కేంద్రంగా అన్నమయ్య జన్మస్థలి అయిన రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తే, ఈ ప్రాంత ప్రజల సౌకర్యాలను మెరుగుపరిచినట్లు అవుతుందని వివరించారు.

**క్రైస్తవుల ఆందోళన..**

రాజంపేట ఆర్ ఎస్ రోడ్డులోని విశ్రాంత ప్రిన్సిపాల్ అజయ్‌బాబు, ఫాదర్ జాన్ ప్రభాకర్ తదితరులు జేఏసీ ఆధ్వర్యంలో క్రైస్తవులు రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

**వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..**

రాజంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో. విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సీనియర్ టీడీపీ నాయకులు నెట్టెం శ్రీరాములునాయుడు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములునాయుడు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలంటే రాజంపేటను జిల్లాకేంద్రం చేయాలన్నారు.

**రెండో రోజు కొనసాగిన రిలే దీక్షలు**

రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ రాజంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి ఆధ్వర్యంలో దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి సౌకర్యంగా ప్రయోజనకరంగా ఆమోదయోగ్యంగా ఉండాలంటే రాజంపేటను జిల్లా చేయడం సబబు అన్నారు.



రాజంపేటలో ఆందోళన చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



ఆందోళనలో పాల్గొన్న క్రిస్టియన్లు, మహిళలు

# ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడపలోనే ఉంచాలి

●బుధవారం భారీ ర్యాలీకి సన్నాహాలు ● కలెక్టర్‌ను కలవనున్న బీజేపీ నాయకులు ● ఒంటిమిట్టలో ఉధృతం కానున్న ఉద్యమం

ఒంటిమిట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడపజిల్లాలోనే ఉంచాలని మండల జేఏసీ నాయకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక హరిత హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడపలోనే ఉంచాలని లేకపోతే రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని వారు డిమాండ్ చేశారు. బుధవారం నుంచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు తెలియజేశారు. ఆ రోజు మధ్యాహ్నం ఒంటిమిట్ట ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించనున్నామన్నారు. ఇదే ప్రదేశంలో వంటా వార్పు కార్యక్రమం ఏర్పాటు చేసి రెండు గంటల పాటు సామూహిక భోజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని, ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, మహిళలు, రైతులు, ఉపాధ్యాయులు, యువత భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు బొబ్బిలి రాయుడు, గజ్జల శ్రీనివాసులరెడ్డి, రామాంజనేయులురెడ్డి, చింతగింజల సుబ్రమణ్యం, మౌలాలి, ఎంపీటీసీ బాషా, మామిళ్ల రామకృష్ణయ్య పాల్గొన్నారు.

**రెండో రోజుకు చేరిన నిరాహార దీక్షలు**

ఒంటిమిట్టను కడప జిల్లాలోనే ఉంచాలని జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అడ్వకేట్ రామదాసు, ఎన్వీ రమణ, గజ్జల నరసింహారెడ్డి, వెంకటసుబ్బయ్య, గజ్జల శ్రీనివాసులురెడ్డి, పాటూరు గంగిరెడ్డి, బొబ్బిలి రాయుడు, కట్టా యానాదయ్య, రోశయ్య, మౌలాలి తదితరులు పాల్గొన్నారు. సిద్దవటం: సిద్దవటం మండలాన్ని రాయచోటిలో కలుపుతూ ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్స్‌పై ప్రజలు తమ అభిప్రాయాలను కడప జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారు సమావేశమై కార్యాచరణ రూపొందించారు. మండలాన్ని రాయచోటి లో కలిపితే ప్రజలకు జరిగే నష్టాన్ని వివరిస్తూ పేపరుపై రాసి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో ఇవ్వాలని నిర్ణయిం చారు. సాయంత్రం మండలం లోని అన్ని గ్రామ పంచాయతీల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించి కొవ్వొత్తులు, దీపాలను వెలిగించి శాంతియుతం గా నిరసన ప్రదర్శించాలని సూచించారు. త్వరలో భారీ ర్యాలీ, మానవహారం, రిలే నిరాహార దీక్షలు నిర్వహి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జేఏసీ నాయకులు, స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



ఒంటిమిట్ట: హరితా హోటల్‌లో సమావేశమైన జేఏసీ నాయకులు



సిద్దవటంలో నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

## సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా వరలక్ష్మి

పెనగలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 17 మందికి రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి ఆదివారం రూ.10,96,694 విలువైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయా చెక్కులను లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి నేరుగా వారికే అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు క్లస్టర్ ఇన్‌చార్జి పి.రవికుమార్, దాసరి దామోదర్‌నాయుడు, కె.సుదర్శన్‌చౌదరి, కేఎస్ఆర్, జనసేన మండల కార్యదర్శి గొబ్బూరు హరిబాబురాయల్, ఓబిలి ఇన్‌చార్జి షేక్ అమీరుల్లా, డిష్ కరీముల్లా, ఎం.శ్రీనివాసులు, జి.రామయ్య పాల్గొన్నారు.

## ‘మాట నిలుపుకున్న కూటమి ప్రభుత్వం’



విలేకరులతో మాట్లాడుతున్న కొండా భాస్కర్‌రెడ్డి, రెడ్డెయ్యయాదవ్

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూ టమి నేతలు ఇచ్చిన మాట ప్రభుత్వం నిలుపుకుందని ఏపీ ఐఐసీ డైరెక్టర్ కొండారెడ్డి, రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగోళ్ల రెడ్డెయ్య తెలిపారు. ఆదివారం చౌటపల్లిలో మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి ఇచ్చిన విందులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తవుతున్న సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. రాయచోటి జిల్లా కేంద్రాన్ని నిలబెట్టిన రోడ్డు రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలి పారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ పోలురెడ్డి సుబ్బారెడ్డి, బీసీ సంఘం నాయకుడు విజయభాస్కర్, మార్ల మోహన్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు వెంకట రామరాజు, మైనార్టీ నాయకుడు దర్మారెడ్డి, శ్రీనివాసులు, నసీరుద్దీన్ పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



గాలివీడులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గాలివీడు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ 1982-83 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు స్థానిక ఎస్కే ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో మిత్రులందరూ గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఆత్మీయ వాతావరణంలో విందు భోజనంతో కార్యక్రమం ముగిసింది.

## ‘ఘంటసాల పాటలన్నీ సుమధురమే..’

రాజంపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన ప్రతిపాట సుమధుర గీత మేనని రాజంపేట హెడ్ పోస్ట్ మాస్టర్ లక్ష్మీనారాయణ తెలిపా రు. ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సితారా ఈ వెంట్స్, ఆలపాన ఆర్కెస్ట్రా సంయుక్తంగా నిర్వహించిన ఘంటసాల 103వ జయంతి ఉత్సవానిల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 80 మంది పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో కవి గంగనపల్లి వెంకటరమణ, కళాంజలి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎస్.కళాంజలి అప్పారావు, ఆలాపన, ఆర్కెస్ట్రా నిర్వాహకులు పెంచలయ్య, సితారా ఈవెంట్స్ నిర్వాహకులు శ్రీనివాసులు, నాగా డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు నాగేశ్వరరావు, పాల్గొన్నారు. ఘంటసాల పాటలు పాడినవారికి మెమెంటోలు అందజేశారు.

## జనవరిలో పౌరహక్కుల సంఘం మహాసభలు

రాయచోటిటౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): జనవరి నెల 10, 11 తేదీల్లో తిరుపతి నగరం బైరాగి పట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో పౌరహక్కుల సంఘం 20వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చీమలపెంట వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సంఘం ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు పీ. రెడ్డెయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎం. రవిశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు వంగిమళ్ల రమణ, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలకు అనుగుణంగా విమానాలు నడపాలి

రాయచోటిటౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, ప్రైవేటీకరణ ధోరణి, కార్పొరేట్ లాభాలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విమాన టికెట్ల అసహజ పెరుగుదల, అస్తవ్యస్థమైన షెడ్యూల్‌లు, తరచూ రద్దులు, సేవల లోపం ప్రజలపై భారం పెరుగుతున్నాయన్నారు. విమాన చార్జీల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు కంపెనీల నియంత్రణ కోసం బలమైన నిబంధనలు అమలు చేసి ప్రజా ప్రయోజనాలు రద్దు చేసే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు సరైన పరిహారం ఇవ్వడం నిర్బంధం చేయాలన్నారు. ప్రాంతీయ విమానాశ్రయాల అభివృద్ధి వేగవంతం చేయాలని, చిన్న పట్టణాలకు సులభంగా చేరుకునేలా ఉడాన్ ప్రాజెక్టును పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇండిగో, ఎయిర్ ఇండియా సహా ప్రజా రంగ విమాన సంస్థలను బలోపేతం చేయాలని, ఉద్యోగులను రక్షించాలని, ప్రయాణికుల హక్కులను రక్షించడం, అందరికీ అందుబాటు ధరలో విమాన ప్రయాణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కార్పొరేట్ లాభాలకు ప్రాధాన్యత ఇచ్చే విధానాలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించాలని, కార్పొరేట్ ప్రైవేటీకరణ విధానాలు మానుకొని ప్రభుత్వ రంగ సంస్థలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి జగన్‌బాబు, అంజనేయులు, ఓబులేసు పాల్గొన్నారు.



# విద్యుత్ తీగలా.. యమపాశాలా?

● ప్రాణాలు కోల్పోతున్న మూగజీవులు

● తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం

● ఆందోళనలో ప్రజలు

రైల్వేకోడూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణం లో విద్యుత్ తీగలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రతి వీధిలోనూ విద్యుత్ స్తంభానికి 10 నుంచి 20 కనెక్షన్లు. వేలాడుతున్న తీగలు కనిపిస్తాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేవు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో లోపాల కారణంగా రోజుకు రెండు నుంచి మూడు సార్లు కరెంట్ పోతోందని ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ఎక్కడ పడితే అక్కడ విద్యుత్ తెగి పడిపోతున్నాయని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల శ్రీనివాస థియేటర్ వద్ద విద్యుత్ వైరు ఊడి పడిపోయింది. ఆ దారిలో వర్షపు నీరు నిలిచిఉండడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. దీని కారణంగా ఒక పంది విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. లైన్‌మెన్ ఎక్కువగా వారి సొంత పనులు చూసుకుంటూ కాంట్రాక్టు సిబ్బందిపై ఆధారపడుతుండడమే సమస్యకు కారణమని ప్రజలు అంటున్నారు. పై అధికారులు కూడా సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వకపోవడంతో విద్యుత్ సమస్యలు వస్తున్నాయని ప్రజలు అంటున్నారు. వెంటనే అధికారులు లైన్‌మ్యాన్లు, సిబ్బందిని అప్రమత్తం చేసి రైల్వేకోడూరు పట్టణంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



తెగిపడిన విద్యుత్ తీగ తాకి మృతి చెందిన వరాహం

**15 రోజుల్లో సమస్యల పరిష్కారం**

15 రోజుల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించి, సరఫరాలో అంత రాయం లేకుండా చేస్తాం. సమస్యలు ఉన్న ప్రతి చోటా ప్రత్యేకంగా దృష్టి సారించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టు సిబ్బంది, లైన్‌మెన్ సక్రమంగా పని చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ కారణంగా ప్రమాదాలకు చోటు లేకుండా జాగ్రత్తలు పాటించడంతో పాటు లోవోల్టేజి సమస్యను కూడా పరిష్కరిస్తాం

- యు. ప్రియదర్శన్‌రెడ్డి, ఏడీఈ

**తరచూ విద్యుత్ ప్రమాదాలు**



పట్టణంలో తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో విద్యుత్ తీగలు పడిపోతున్నాయి. దీంతో రోడ్లపై తిరగాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యుత్ తీగలు వేలాడకుండా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రమాదాలు అధికమయ్యే అవకాశం ఉంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- మద్దిన సుబ్బరాయుడు, స్థానికుడు

## కోడి పందాలపై పోలీసు దాడి

● వాహనాలు సహా నగదు స్వాధీనం

నిమ్మనపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లి పంచాయతీలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న కోడిపందాలపై పోలీసులు ఆదివారం మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విష్ణునారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబడిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● విస్తృతంగా గాలింపు చర్యలు



మృతి చెందిన నారాయణ

సిద్దవటం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పొలాలకు కాపలాదారుగా పనిచేస్తున్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి భార్య రత్నమ్మ కథనం మేరకు... మండలంలోని జవుకులపల్లికి చెందిన నారాయణ (45) కడప-చెన్నై జాతీయ రహదారి చర్చి పక్కన ఉన్న పొలంలో కాపలాదారుగా పనిచేస్తూ కుటుంబంతో కలసి అక్కడే నివాసముంటున్నాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవపడంతో పాటు దాడికి యత్నించడంతో ఆమె బాకరాపేటకు పారిపోయింది. ఆదివారం ఆమె తిరిగి వచ్చేసరికి భర్త మృతి చెంది కనిపించాడు. దీంతో ఆమె బంధువులకు సమాచారమిచ్చింది. సమాచారం అందుకున్న ఒంటిమిట్ట సీఐ నరసింహరాజు సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతదేహం నుదిటిపై రక్త గాయం ఉండడంతో కడప నుంచి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీ చేశారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ, క్లూస్‌టీమ్ ఇన్‌స్పెక్టర్ రుక్మిణిదేవి, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి ఆత్మహత్య



మృతి చెందిన వెంకటలక్ష్మమ్మ (ఫైల్‌ఫొటో)

సిద్దవటం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్న కుటుంబానికి భారం కాకూడదని ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మేనల్లుడు కుప్పాల వెంకటసుబ్బయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ పాలకొండ్రాయుని పల్లెకు చెందిన పెద్ద వెంకటలక్ష్మమ్మ (63) భర్త చనిపోవడంతో తన అన్న కుటుంబంతో కలసి నివాసముంటోంది. కొద్ది రోజులుగా ఆమె పక్షవాతంతో బాధపడుతుండడంతో అన్న కుటుంబసభ్యులు అప్పులు చేసి ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. దీంతో వారి కుటుంబానికి భారం కాకూడదన్న ఉద్దేశంతో శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి ఆమె వాంతులు చేసుకుంటూ కనిపించింది. అది గమనించిన కుటుంబ సభ్యులు ఏమైందని ప్రశ్నించగా పురుగులమందు తాగానని చెప్పడంతో వెంటనే 108వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో ఏఎస్‌ఐ బాబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గండికోటలో అభివృద్ధి పనులు ప్రారంభం



గండికోటలో జరుగుతున్న రోడ్డు పనులు

జమ్మలమడుగు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్యాటక ప్రాంతమైన గండికోటలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గండికోటను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించి ఈ ప్రాంతం అభివృద్ధికి సంబంధించి టాస్కీ నిధులు దాదాపు రూ.79 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి వెళ్లారు. తర్వాత సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగా గొడవ చోటుచేసుకుని ఇటీవల సద్దుమణిగింది. ఈ క్రమంలో వేరే కాంట్రాక్టర్ గండికోటలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆదివారం కోట ఎదురుగా లోయ ప్రాంతానికి వెళ్లే దారి, అక్కడి నుంచి గుర్రపుశాల వరకు రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. గతంలో ఎనిమిది అడుగుల రోడ్డు ఉండేదని, మళ్లీ ఎనిమిది అడుగులకు పైగా కొలతలు వేశారు. ఈ మేరకు మట్టి చదును పనులు జరుగుతున్నాయి.

# కుంగిన బ్రిడ్జి



● పట్టించుకోని అధికారులు

● భయాందోళనలో తల్లిదండ్రులు, విద్యార్థులు

ఒంటిమిట్ట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న బ్రిడ్జి కుంగిపోయింది. దీంతో ఆ బ్రిడ్జిపై వెళ్లాలంటే అక్కడి ప్రజలు భయపడుతున్నారు. కడప-చెన్నై ప్రధాన రహదారి నుంచి ఈ గ్రామానికి వెళ్లేందుకు తారురోడ్డు నిర్మించారు. మార్గమధ్యంలో ఒక బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి ఇరువైపులా కుంగిపోవడంతో ఈ గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చెర్లోపల్లె నుంచి ఒంటిమిట్ట, కొత్తమాధవరం, మంటపంపల్లె గ్రామాల్లో ఉన్న పాఠశాలలకు ఇక్కడి విద్యార్థులు వెళుతున్నారు. ఈ క్రమంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు స్కూలుకు వెళ్లి ఇంటికి వచ్చిన పిల్లలను చూస్తేగాని వారి భయం పోవడంలేదు. ఇలా ఎన్నిరోజులు భయపడుతూ తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని ప్రశ్నిస్తున్నారు. ఈ గ్రామాలకు వెళ్లాలంటే బ్రిడ్జిపై వెళ్లాల్సిందే. మరో మార్గం లేదు. ప్రతిరోజు ఈ గ్రామ ప్రజలు వారి అవసరాల నిమిత్తం ఒంటిమిట్ట, కడప, రాజంపేటకు వెళుతూ ఉంటారు. ట్రాక్టర్లు, కార్లు, పలు స్కూటర్లు ఈ బ్రిడ్జిపైనే వెళుతుంటాయి. బ్రిడ్జి కుంగిపోయి 10 రోజులు కావస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ నాగరాజు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం ఈఈతో కలిసి బ్రిడ్జిని పరిశీలించామన్నారు. బ్రిడ్జి వద్ద నిదానంగా వెళ్లాలనే బోర్డును ఏర్పాటు చేయాలని సర్పంచ్‌కు తెలిపామని, త్వరలో మరమ్మతులు చేస్తామన్నారు.

### పిల్లలతో భయపడుతున్నాం..



ప్రతిరోజు పిల్లలు పాఠశాలకు వెళుతున్నారు. ఈ బ్రిడ్జిపై పాఠశాలకు వెళ్లాల్సి రావడంతో భయపడుతున్నాం. వారు ఇంటికి వచ్చేవరకు భయంభయంగానే కాలం గడుపుతున్నాం. అధికారులు త్వరగా స్పందించాలి.

- ప్రతాప్‌రెడ్డి, చెర్లోపల్లె, ఒంటిమిట్ట

### త్వరగా మరమ్మతులు చేయాలి..



మా గ్రామానికి వెళ్లే బ్రిడ్జి కుంగిపోయింది. దీంతో భయంభయంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజులు గడిచే కొద్ది బ్రిడ్జి పూర్తిగా కూలిపోయే అవకాశం ఉంది. అధికారులు త్వరగా మరమ్మతులు చేయాలి.

- రాజారెడ్డి, చెర్లోపల్లె, ఒంటిమిట్ట



కుంగిపోయి నెర్రెలు చీలిన బ్రిడ్జి

# వివాహిత అనుమానాస్పద మృతి

● తలకు బలమైన గాయాలు

● భర్తే చంపి ఉండవచ్చన్న అనుమానాలు

● దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతి చెందిన సుజాత

ప్రొద్దుటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరం వెంకటేశ్వర స్వామి గుడి వద్ద గౌరు సుజాత (42) అనే వివాహిత ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆదివారం త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల మేరకు... చాపాడు మండలం రాజువారి పేటకు చెందిన గౌరు సుజాతకు 2010లో ప్రొద్దుటూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన రవికుమార్‌రెడ్డితో వివాహమైంది. రవికుమార్‌రెడ్డికి శంకరాపురంలో వ్యవసాయ పొలం వుంది. వివాహం అయ్యాక మైదుకూరు రోడ్డులోని టీచర్స్‌కాలనీలో వుండేవారు. వ్యవసాయంతో పాటు ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఇటీవలే మూడు నెలల క్రితం బొల్లవరం వెంకటేశ్వర స్వామి గుడి వద్ద ఓ ఇంటిలో చేరారు. ఇటీవల రవికుమార్ ఆరోగ్యం సరిగాలేక పని చేయలేక ఇంట్లోనే ఖాళీగా వుంటున్నాడు. మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు రవికుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులోనే వుంటున్న సుజాత సోదరికి ఫోన్ చేసి సుజాత మరణించిందనే సమాచారమిచ్చాడు. దీంతో సుజాత బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో మంచం వద్ద రక్తపుమడుగులో సుజాత నిర్జీవంగా పడివుంది. క్లూస్ టీం పరిశీలించింది. తలకు బలమైన గాయంతో ఆమె మరణించి వుంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి భర్త రవికుమార్‌పై కూడా బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది హత్య లేదా ప్రమాదమా అనేదానిపై పోలీసులు విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

## తృటిలో తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం

● ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్



బోల్తా పడిన జిప్సం టిప్పర్

ముద్దనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును జిప్సం లోడు తీసుకొని వస్తున్న టిప్పర్ ఢీకొని బోల్తా పడింది. ఆదివారం రాత్రి ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం లేదు. స్థానికుల సమాచారం మేరకు... నంద్యాల నుంచి ముద్దనూరులోని మనగ్రోమోర్‌కు జిప్సం లోడు తీసుకువస్తున్న టిప్పర్ జమ్మలమడుగు ఘాట్ రోడ్డులో బ్రేక్ ఎయిర్ ట్యాంక్ పగిలిపోవడంతో టిప్పర్ అదుపు తప్పింది. దీంతో అతివేగంగా టిప్పర్ ఘాట్ రోడ్డులో వస్తోంది. ముద్దనూరు టౌన్ నుంచి జమ్మలమడుగుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు శివాలయం వద్దనున్న కాయన వంక మీదుగా వస్తుండగా టిప్పర్ డ్రైవర్ మనోహర్ కేకలు వేసుకుంటూ వచ్చాడు. అరుపులు విన్న వాహనచోదకులు శివాలయం ముందు నిలిచి ఉన్న పెళ్లి బృందం ఐచర్ వాహనం ముందుకు వెళ్లిపోయింది. ఎదురుగా వెళుతున్న ఆర్టీసీ బస్సును రోడ్‌సైడు నిలిపివేశాడు. ఈ క్రమంలో బస్సును తప్పించబోయి టిప్పర్ డ్రైవర్ బస్సును కుడివైపు రాచుకుంటూ వెళ్లడంతో టిప్పర్ బోల్తా పడింది. ఆర్టీసీ బస్సు అద్దం పగిపోయింది. అప్పటికి బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. టిప్పర్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. పెళ్లి బృందం ఐచర్ వాహనం, బస్సును ఢీకొన్నా ప్రాణనష్టం జరిగి ఉండేది. కేవలం నేషనల్ హైవే అధికారులు బైపాస్ రోడ్డు ఏర్పాటులో భారీ తప్పిదం చేశారని, ఘాట్ రోడ్డు నుంచి నేరుగా ముద్దనూరు టౌన్‌లోకి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికి 6 లారీ ప్రమాదాలు జరిగి టౌన్‌లోని ఇళ్ల యజమానులకు భారీ నష్టం వాటిల్లింది. గతంలో నేషనల్, హైవే అధికారులకు, కలెక్టర్ దృష్టికి బాధితులు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఇటువంటి ప్రమాదాలు జరుగకుండా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆసక్తికరంగా క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండురోజుల క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం ఆసక్తికరంగా సాగుతున్నాయి.



లిఖిత్ ఇరగంరెడ్డి (96పరుగులు)



ఐదు వికెట్లు సాధించిన చాణక్య సాయి

**ఏసీఏ క్రికెట్ మైదానంలో..**

నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 300పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. చరణ్‌తేజ్ 70పరుగులు, యాసిన్ సిద్దిక్ 53 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి ఐదు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 12పరుగులు చేసింది. దీంతో మరో 288 పరుగుల వెనకంజలో ఎదురీదుతోంది.

**కేఓఆర్ఎం మైదానంలో...**

నగర శివారులో ఉన్న కేఓఆర్ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్, నార్త్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 179 పరుగులకు కుప్పకూలింది. ఏవీ చరణ్ 53 పరుగులు చేశాడు. కాగా బౌలింగ్ విభాగంలో నార్త్ జోన్ విన్నర్స్ జట్టు బౌలర్ చాణక్యసాయి 5వికెట్లు పడగొట్టారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన నార్త్ జోన్ విన్నర్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి కేవలం 30 పరుగులు మాత్రమే చేసింది. దీంతో మరో 149 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది. కాగా బౌలింగ్ విభాగంలో బౌలర్ చాణక్యసాయి 5 వికెట్లు పడగొట్టారు.

**కేఎస్ఆర్ఎం మైదానంలో...**

నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో సౌత్ జోన్ విన్నర్స్, రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన సౌత్ జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికట్లు కోల్పోయి 251 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో లిఖిత్ ఇరగంరెడ్డి 96 పరుగులు, ప్రణవ్ గోవర్ధన్ 65 పరుగులు చేశారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో1 వికెట్ నష్టపోయి 39 పరుగులు చేసింది. దీంతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు మరో 212 పరుగుల వెనుకంజలో ఎదురీదుతుంది.

## లారీ కింద పడి వ్యక్తికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకృష్ణా సినిమా థియేటర్ సమీపంలో ప్రధానదారిపై ఆదివారం రాత్రి లారీ కింద పడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని గ్రామ పంచాయతీ కాలనీకి చెందిన పారిశుధ్య కార్మికుడు వెంకటేష్ ప్రధానదారి దాటి ఇంటికి వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా తిరుపతి నుంచి కడప వైపు వెళుతున్న లారీ కింద పడి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని కోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రక్తస్రావం ఎక్కువగా ఉండడంతో వైద్యులు తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజలు



అయ్యప్పస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో పెన్నానది ఒడ్డున వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం, శనివారం అంబలం పూజ నిర్వహించారు. ఈ క్రమంలో ఆదివారం కూడా అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రం లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నివాస గృహం వీధి, పాతూరు గ్రామంలో నివాసం ఉంటున్న సూరే వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. ఈ పూజా కార్యక్రమానికి మండలంలోని అయ్యప్పస్వాములంతా పాల్గొని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి అయ్యప్పస్వామికి కాయకర్పూరం సమర్పించారు. అనరంతరం అయ్యప్పస్వాములు, ప్రజలకు, భక్తులకు ప్రసాదాన్ని అందించారు.



అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న భక్తులు

## రాష్ట్ర స్థాయి టాంగ్-థా పోటీలకు 36 మంది ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

పరవాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరవాడ ఇండోర్ స్టేడియంలో టాంగ్-థా అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఏడు జిల్లాల నుంచి 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఆద్యంతం పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలకు 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం.నాయుడు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 17 నుంచి 22వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి టాంగ్-థా పోటీల్లో 36 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఎంవీ.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి అచ్చెమ్మ, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పరిశీలకులు శ్రీహరిరాజు, ఏవీడీ ప్రసాద్, నాయుడు, ప్రతినిధులు జి.రాజు, ఎ.నూకరాజు, ఎస్.శ్రీనివాస్, పి.లక్ష్మి పాల్గొన్నారు.

## సాయం చేయకపోతే నిరసన చేస్తాం

● రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ





మాట్లాడుతున్న ఏవీ రమణ

మైదుకూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటకు ప్రభుత్వం ప్రకటించిన రూ.50వేల సాయాన్ని వెంటనే విడుదల చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ డిమాండు చేశారు. స్థానిక కృష్ణపురం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో రమణ మాట్లాడుతూ కడప, కర్నూల్ జిల్లాలో కురిసిన అధిక వర్షానికి దెబ్బతిన్న ఉల్లి పంటకు రాష్ట్ర ప్రభుత్వం 50 వేల రూపాయలను సాయం అందిస్తాని ప్రకటించి రెండు నెలలు అవుతోందన్నారు. ఇంతవరకు నిధులను విడుదల చేయలేదని డిమాండు చేశారు. వెంటనే విడుదల చేయని పక్షంలో ఈనెల 15వ తేదిన కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చొక్కం సంజీవరాయుడు, కూశెట్టి పుల్లయ్య, బీఎల్ రామ్మోహన్, కొండయ్య, భూమిరెడ్డి కొండారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి చలి.. ఉదయం పొగ మంచు..



● ప్రజల ఇక్కట్లు

ఓబులవారిపల్లె, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా ఎడతెరపి లేకుం డా కురిసిన వర్షాల నుంచి ప్రజలు తేరుకోకమునుపే చలి, పొగమంచుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో తీవ్రమైన చలి భయపెడు తోంది. తెల్లవారితే పొగమంచుతో ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటల వరకు కూడా పొగమంచు వీడకపోవడంతో ప్యాసింజర్ రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రజలు రాత్రివేళ చలితో, పగటిపూట పొగమంచుతో పనులు ఆలస్యమవుతున్నాయని చెబుతున్నారు.



ఉదయం 7.30 గంటల సమయంలో పూర్తిగా పొగమంచు ఉన్న దృశ్యం

# ఇదేమి దేవరా...?!

## తుప్పు పట్టిన ఉత్సవ విగ్రహాలు

## భక్తుల మనోభావాలతో ఆటలాడుతున్న టీటీడీ



సీతా, రామ, లక్ష్మణ, హనుమ ఉత్సవ విగ్రహాలు - (పక్కన) తుప్పుపట్టినట్లు చూపుతున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎంతో పవిత్రంగా ఆలయంలో విగ్రహాలు ప్రతిష్ఠిస్తారు. అయితే ఆలయంలో ప్రతిష్ఠించే ప్రతిమలను దేవదాయ శాఖ నుంచి టీటీడీకి నివేదించి ప్రత్యేక స్థపతులతో తయారు చేయించి తెప్పిస్తారు. వీటికి ఆయా ఆలయాల ధర్మకర్తలు నిధులు కూడా సమకూరుస్తారు. అయితే మండల కేంద్రంలోని సంతబజారు వీధిలో రెండేళ్ల కిందట కొత్తగా నిర్మించిన కోదండరామాలయానికి ఉత్సవ విగ్రహాల కోసం ప్రజలు తిరుమల తిరుపతి దేవస్థానానికి ఉత్సవ విగ్రహాల కోసం దరఖాస్తు చేసుకుని తమ వాటాగా రూ.45,578లు చలానా రూపంలో చెల్లించారు. దీంతో సంబంధిత దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తిరుమల తిరుపతి దేవస్థానం తిరుపతి వారి నుంచి గ్రామస్తులు శ్రీరామచంద్రుడు, లక్ష్మణుడు, సీతాదేవి, ఆంజనేయస్వామి ఉత్సవ పంచలోహ విగ్రహాలను గ్రామస్తులు తెచ్చుకున్నారు. అయితే గ్రామస్తులు కొన్ని అనివార్య కారణాలచేత దేవాలయంలో ఉన్న ఓ బీరువాలో దాచిఉంచారు. ఈ నెల 7వ తేదీన ఆలయంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించాలని గ్రామస్తులు నిర్ణయించి బీరువాలో పెట్టిన పంచలోహ విగ్రహాలను బయటికి తీసి చూడగా ఆ పంచలోహ విగ్రహాలు తుప్పు పట్టడం, రంధ్రాలు పడి పూర్తిగా పాడైపోయాయి. దీన్ని చూసిన గ్రామస్తులు అవక్కయ్యారు. ఎడాదిన్నర కూడా కాకుండానే పంచలోహ విగ్రహాలు తుప్ప పట్టడంతో నాసిరకం పంచలోహ విగ్రహాలను అధికారులు ఇచ్చారంటూ గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత టీటీడీ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# బెల్టు బెండు తీసేదెవరు...?

## గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు ● చోద్యం చూస్తున్న అధికారులు

గుర్రంకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణం, గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే బెండు తీస్తామని ప్రభుత్వం స్పష్టంగా చెబుతోంది. బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపి నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలున్నాయి. ఈ నిబంధనలను మద్యం వ్యాపారులు తుంగలో తొక్కి మద్యాన్ని బెల్టు షాపుల ద్వారా ఏరులైపారిస్తున్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలను నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై విశ్వాసం లేని ప్రజలు బెల్టు షాపుల సమాచారం స్థానిక పోలీసులకు అందజేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు బెల్టు షాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తుండడంతో ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై మహిళలు, ప్రజలు గుసగుసలాడుతున్నారు.

గుర్రంకొండ మండలంలో మూడు మద్యం దుకాణాలున్నాయి. ఇందులో భాగంగా గుర్రంకొండలో రెండు, తరిగొండలో ఓ మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ మద్యం దుకాణాల నుంచి బెల్టు షాపు నిర్వాహకులు మద్యం కొనుగోలు చేసి గ్రామాల్లో మద్యాన్ని విచ్చలవిడిగా అమ్ముతున్నారు. ఈ బెల్టు షాపులో క్వాటర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.50 వరకు అధిక రేట్లుకు అమ్ముతున్నారు. బెల్టు షాపులో మద్యం రేటు ఉదయం నుంచి సాయంత్రం దాకా ఓ రేటు రాత్రి 10 గంటలు దాటితే మరోరేటుకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉదయం 6 గంటలకు మంచి నీళ్లు, పాలు దొరకడం కష్టం కావచ్చు కానీ మద్యం బెల్టు దుకాణాల్లో దొరకడం తథ్యం. నబీకాలనీ, ఇందిరమ్మ కాలనీ, హరిజనవాడ, మార్కెట్ యార్డు సమీపంలోని పలు హోటళ్ల వద్ద బెల్టు షాపులో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. గ్రామాల్లో ఊరికి రెండు నుంచి మూడు వరకు బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల వద్ద మందుబాబుల ఆగడాలు రోజు రోజుకీ మితిమీరిపోతున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం పూట వాకింగ్‌కు వెళ్లే మహిళలు మందుబాబుల భయంతో ఆందోళన చెందుతు న్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో పాఠశాల పక్కనే బెల్టు షాపులు నిర్వహించడం గమనార్హం. మందుబాబుల ఆగడాలను భరించలేని మహిళలు, ప్రజలు స్థానిక పోలీసులకు తమ గోడు వెల్లబోసుకోవడంతో దాడులు నిర్వహిస్తున్నారు. ఇరవై రోజుల్లో టి.పసలవాండ్లపల్లె, గుర్రంకొండ, నడిమిఖండ్రిగ గ్రామాల్లో నాలుగు బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేసిన కేసులు నమోదు చేశారు. మండలంలో పోలీసులు బెల్టు షాపులపై దాడులు చేస్తుంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. జిల్లా అధికారులు స్పందించి బెల్టు దుకాణాలను అరికట్టాలని గ్రామంలోని పలువురు మహిళలు, ప్రజలు కోరుతున్నారు.



టి.పసలవాండ్లపల్లెలో బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు(ఫైల్‌ఫోటో)

### బెల్టు షాపులను కట్టడి చేస్తాం

గుర్రంకొండ మండలంలో బెల్టు షాపుల నిర్వహణపై ప్రజలు పోలీసులకు స్వచ్ఛందంగా తెలియజేయాలన్నారు. బెల్టు షాపులను నిర్వహించడం నేరం నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటాం. మందుబాబులు మహిళలు, ప్రజలను ఇబ్బందిపెడితే చర్యలు తప్పవు.

బి.బాలకృష్ణ, ఎస్ఐ, గుర్రంకొండ

# పంచాయతీలు బాగుపడేనా..?

## డీడీఓ పాలనతో ప్రక్షాళనేనా ? ● ఎక్కడి చెత్తదిబ్బలు అక్కడే ● కార్మికుల సహాయ నిరాకరణ



కురవంక పంచాయతీ సరస్వతీనగర్‌లో పేరుకుపోయిన చెత్త

మదనపల్లె టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వ్యవస్థను ప్రారంభించింది. దీనికి తోడు స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, చెత్తసేకరణ, కంపోస్టు యార్డులు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లకు తరలించడం తదితర అంశాలను ప్రధానంగా ఈ కార్యక్రమంలో పరిగణించాలి. కానీ క్షేత్ర స్థాయిలో చూస్తే ఎక్కడ కూడా ఈ అంశాలు కనిపించడం లేదు. ఉదాహరణకు మదనపల్లె పట్టణ శివారు గ్రామ పంచాయతీలో ఆంధ్రజ్యోతి పరిశీలనలో చెత్తదిబ్బలు, మురుగు కాల్వల నిర్వహణ అధ్వాన్నంగా కనిపించాయి. పట్టణ శివారుల్లో కురవంక, కోళ్లబైలు, తట్టివారిపల్లె, కొండామరిపల్లె, బసినికొండ, కొత్తిండ్లు, కొత్తపల్లె, అంకిశెట్టిపల్లె పంచాయతీలు వున్నాయి. ఈ పంచాయతీల్లో జనాభా కూడా అధిక సంఖ్యలోనే వున్నారు. దీనికి తగ్గట్టు ఈ పంచాయతీలకు పన్నులు, ఇంటి అప్రూవల్ తదితర విధానాలతో ఆదాయం కూడా గణనీయంగా వుంటోంది. కాగా కొందరు సర్పంచులు, అధికారులకు ఇటీవల బేధాభిప్రాయాలు తలెత్తడంతో పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ పక్కదారి పడుతోంది. వీటిలో కొన్ని పంచాయతీల్లో రెగ్యులర్ కార్యదర్శులు లేక, రెండు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేదు. దీంతో వారం రోజులుగా కార్మికులు సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఈ పంచాయతీల్లోని వీధుల్లో చెత్త సేకరించే వారు రాకపోవడంతో చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. రెండు పంచాయతీల్లో చెత్త తరలించే వాహనాలు లేకపోవడంతో చెత్తను వీధుల్లోనే వదిలేశారు. ఏ వీధిలో చూసినా దుర్గంధం వెదజల్లుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాల్లో మొబైల్ యాప్ ద్వారా పారిశుధ్య నిర్వహణ అప్‌లోడ్ చేయాల్సి వున్నా, అవేమీ ఇక్కడ కనిపించడం లేదు. ఇప్పటికైనా డివిజన్ పంచాయతీ అధికారులు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు పట్టణ శివారులోని పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాల్సి వుంది.





కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డికాలనీలో చెత్త దిబ్బలు - అంకిశెట్టిపల్లె పంచాయతీ బెంగళూరురోడ్డు పక్కన....

## సీఎంను కలిసిన టీఎన్ఎస్ఎఫ్ నేత



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ నేత అబ్బూరి

కలకడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిసినట్లు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అబ్బూరి చంద్రబాబు నాయుడు తెలిపారు. పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించినందుకు సంతోషం వ్యక్తపరచి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపానన్నారు.

## రామసముద్రం ఎస్ఐగా దిలీప్‌కుమార్



రామసముద్రం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామ సముద్రం ఎస్ఐగా దిలీప్ కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ముదివేడు పోలీస్ స్టేషన్ నుంచి ఇక్క డికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తూ ఉండిన ఎస్ఐ రమేష్ బాబు రాయచోటి సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు.

## వైభవంగా కామేశ్వరస్వామికి అభిషేకాలు



వాల్మీకిపురం, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన లక్ష్మీ కామేశ్వరస్వామి ఆలయం, పట్టణ సమీపంలోని వీరభద్రాద్రిపై వెలసిన శ్రీవీరభద్ర స్వామి దేవాలయాల్లో విశేష పూజలు జరిగాయి. స్వామివారి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పంచామృతాలు, పంచగవ్యాలు, పంచరసాలతో రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణలతో అశేష భక్తజనం నడుమ పూజలు జరిగాయి. వేడుకల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త కువైట్ శంకరాచారి, అర్చకులు గోనవరపు శీనా స్వామి, యోగిస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : ఎమ్మెల్యే




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

నిమ్మనపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పేరు తీసుకు రావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. ఆదివారం రెడ్డి వారిపల్లి పంచాయతీ మోడల్ స్కూల్‌లో అస్మిత ఖేలో ఇండియా షూటింగ్ బాల్ పోటీల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్య వస్థలో ఎన్నో మార్పులు చేసిందని ముఖ్యంగా తల్లి కి వందనం పథకంలో ఎందరో మంచి పిల్లలు చదువుకుంటున్నారన్నారు. మోడల్ స్కూల్ ప్రవేశ పెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థినులు రాణించినవుడే తల్లిదండ్రులతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. మోడల్ స్కూల్‌లో జరిగిన అస్మిత ఖేలో ఇండియా షూటింగ్ బాల్ పోటీల్లో చిత్తూరు జిల్లా మోదటి స్థానం కైవశం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, జిల్లా కార్యదర్శి గౌతమి, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ, నేతలు మునిరత్నం, రాజన్న, రాజ, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్ స్ట్రీట్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం

మదనపల్లె టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక రీడింగ్‌రూమ్ వీధిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. ఆదివారం ఆర్ఆర్‌వీధి వస్త్ర వ్యాపారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే మదనపల్లె జిల్లా ఏర్పాటు కానుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు పలుచోట్ల రోడ్లను వెడల్పు చేయాల్సిన అవసరం వుందన్నారు. వెంకటేశ్వరాలయ ఛైర్మన్ నవీన్‌చౌదరి, వస్త్రవ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్ల హిమ గిరి, టీడీపీ నేతలు నాగయ్య, బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటాలకు సన్నద్ధం కావాలి

ములకలచెరువు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం రావాలని సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప పిలుపు నిచ్చారు. బురకాయలకోట ఎస్సీ కాలనీలో ఆదివారం సీపీఐ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం బురకాయలకోట సీపీఐ కార్యదర్శులుగా శేఖర్, రెడ్డెప్పను ఎన్నుకున్నారు. ఏఎస్ఎఫ్ మండల నేత తరుణ్, రైతు సంఘం జిల్లా నాయకుడు చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులు సహకరించాలి




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ యువరాజ్

కురబలకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కళాశాల పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయసహకారాలు అందించాలని పారిశ్రామికవేత్త కౌడిన్య పేకేటీ మిట్స్ వీసీ యువరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో కళాశాలలో చదివిన పూర్వవిద్యార్థులకు హైదరాబాద్‌లో అలూమిని మీట్‌ను ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాల పూర్వవిద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుని దేశ,విదేశాల్లో స్థిరపడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు తమవంతుగా సామాజిక సేవ కార్యక్రమాలను చేపట్టి ఆదర్శవంతంగా నిలవాలన్నారు. వృత్తి పరంగా వివిధ ప్రాంతాలు, దేశాల్లో స్థిరపడ్డారని, క్షణం తీరిక లేకుండా వారివారి పనుల్లో బిజీబిజీగా గడుపుతున్న తరుణంలో తాము చదివిన కళాశాల యాజమాన్యం పిలుపు మేరకు పూర్వ విద్యార్థులు తరలి రావడం వారి నిబద్ధతకు నిదర్శనమన్నారు. కళాశాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతో కృషి చేస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకుని తమ నిర్ధిష్ట లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం కళాశాలలో చదివిన విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి చిన్నపిల్లల్లాగా సందడి చేశారు. కాలేజీ రోజుల అనుభూతులను గుర్తుచేసుకుంటూ స్నేహితులతో సరదాగా గడపడం, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం కేక్ కట్ చేసి సంబరాలను ముగించారు. ప్రిన్సిపాల్ రామనాథమ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ టి.జి.రవికుమార్, అల్యూమిని రిలేషన్స్ ఆఫీసర్ నాగశ్వేత, అల్యూమిని రిలేషన్స్ సెక్రటరి భరత్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## విశేషాలంకరణలో యోగభోగేశ్వరుడు



మదనపల్లె అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చిప్పిలి గ్రామంలో (మడికయ్యల శివాలయం) యోగభోగేశ్వరుడి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని శివుడికి విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వర ప్రసాద్ ఆదివారం ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు, హోమాలు చేశారు. యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రుద్రాభిషేకంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## నవోదయలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




నవోదయలో కలిసిన పూర్వ విద్యార్థులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వలసపల్లె నవోదయ పాఠశాలల్లో 25 ఏళ్ల కిందట ఇక్కడ చుదువున్న 14వ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో చదువుకున్న విద్యార్థులు వివిధ స్థాయిల్లో, వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. తమ అనుభవాలను, అనుభూతులను పంచుకుంటూ ఒకరి కొకరు శుభాకాంక్షలు ప్రకటించుకున్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి అందులో ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ గీత మాట్లాడుతూ విద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి .పనులు, ప్రత్యేక శిక్షణ తరగతుల గురించి వివరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షలు ప్రశాంతం

### పరీక్షలకు 1462మందికి 1412 హాజరు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏడు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం ఎన్ఎంఎంఎస్ పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జడ్పీ హైస్కూల్‌లో 'ఎ','బి' రెండు కేంద్రాలు, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, హోప్ మున్సిపల్ హైస్కూల్, రామిరెడ్డి లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్, మాయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్ కేంద్రాల్లో మదనపల్లె డివిజన్ విద్యార్థులు పరీక్ష రాశారు. 1462మంది హాజరు కావాల్సి ఉండగా 1412మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీవైఈఓ లోకేశ్వర్ రెడ్డి, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ పర్యవేక్షించారు.

## ఉత్తమ అధ్యాపకురాలిగా డాక్టర్ రమ్య



మదనపల్లె టౌన్, డిసెంబరు 7( ఆంధ్ర జ్యోతి): న్యూఢిల్లీకి చెందిన సైంటిఫిక్ లారెన్స్ సంస్థ ఏటా నిర్వహించే ఉత్తమ అధ్యాపకురాలు అవార్డు మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల బయోలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమ్య అందుకున్నారు. దేశ వ్యాప్తంగా పరిశోధనలు చేస్తూ, ఉత్తమ రీసెర్చ్‌లు కనుగొంటున్న అధ్యాపకులకు సైంటిఫిక్ లారెన్స్ సంస్థ 2025కి బయోలజి ప్రొఫెసర్ డాక్టర్ రమ్యకు ఈ అవార్డు పంపారు. అవార్డు సహా షీల్డు, సర్టిఫికెట్ అందజేశారు. డాక్టర్ రమ్యను కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి అభినందించారు.



## నాగారపమ్మకు పూజలు, బోనాలు



సుండుపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దినేని కాల్వ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలోని నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. మండలం సహా రాయచోటి, పీలేరు, రాజంపేట తదితర ప్రాంతాల భక్తులు బోనాలు సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు తలనీలాలను సమర్పించారు. అనంతరం ఆలయ సమీపంలోని మామిడి తోటల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## 300మందికి ఉచిత వైద్య పరీక్షలు

వాల్మీకిపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం సహారా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక శిబిరాలుగా ఏర్పాట్లు చేశారు. రామస్వామి హృదయాలయ ఆస్పత్రి తదితర మందనపల్లెకు చెందిన ప్రైవేట్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో సుమారు 300మందికి పైగా ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు సాధిక్ మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. వైద్య శిబిరానికి సహకరించిన వైద్యులు, సిబ్బందిని ట్రస్టు సభ్యులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమాల్లో డాక్టర్లు చంద్రశేఖర్, హేమప్రియ, వంశీధర్‌రెడ్డి, హరి, జయకృష్ణ, అనీల్‌కుమార్, ప్రదీప్‌కుమార్, ఆస్పత్రుల సిబ్బంది, ట్రస్టు సభ్యులు జమీల్, అషర్, ఇర్ఫాన్, అయ్యప్ప, అష్రఫ్, జావీద్, మన్సు, ఇమ్రాన్, కలందర్, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బండి ఆనంద్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మదనపల్లె వాసి బండి ఆనంద్‌ను నియమించినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాధవ్, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్‌లో అనేక బాధ్యతలు చేపట్టి, 13 ఏళ్లగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా పని చేశానన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర ఓబీసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపిశ్రీనివాస్, నాగోతు రమేశ్ నాయుడు, దయాకర్‌రెడ్డి, సాయిలోకేశ్, పోతుగంట రమేష్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.